కొను'గోల్‌మాల్'

- రెండు రకాల ధాన్యాన్ని కామన్ రకం కింద కొనుగోలు
- ఏ-గ్రేడ్ రకం ధాన్యానికీ కామన్ రకం ధర
- క్వింటాల్‌కు రూ. 20 చొప్పున కోల్పోయిన రైతులు
- అధికారుల సహకారంతోనే దోపిడీ
- పౌరసరఫరాల సంస్థ తీరుపై విమర్శల వెల్లువ
- దృష్టికి వచ్చిందన్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి

కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని తూకం వేస్తున్న నిర్వాహకులు

వరంగల్, జూన్ 22(నమస్తేతెలంగాణ): జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోళ్లలో గోల్‌మాల్ జరిగింది. కొనుగోలు కేంద్రాల్లో ఏ-గ్రేడ్ రకం ధాన్యం అమ్మిన రైతులు ఆర్థికంగా నష్టపోయారు. క్వింటాల్‌కు రూ. 20 చొప్పున కోల్పోయారు. యాసంగి ధాన్యం కొనుగోలు కోసం ఇటీవల జిల్లాలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనే ఈ దోపిడీ జరిగింది. బాధిత రైతులు తమ దృష్టికి తెచ్చినప్పటికీ అధికార యంత్రాంగం అడ్డుకోకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. రైతుల నుంచి గత యాసంగి ధాన్యం నేరుగా కొనుగోలు చేయడానికి ప్రభుత్వం జిల్లాలో మొదట 206 కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. తీరా 170 కేంద్రాల్లో మాత్రమే కొనుగోలు చేసింది. ఈ కేంద్రాల్లో 17,849 మంది రైతుల నుంచి 87,102 టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు పౌరసరఫరాల శాఖ అధికారులు వెల్లడించారు. ప్రభుత్వ మద్దతు ధర ప్రకారం దీని విలువ రూ. 190.99 కోట్లు. ఇందులో రూ. 185.03 కోట్లు ధాన్యం విక్రయించిన రైతులకు పౌరసరఫరాల శాఖ ద్వారా చెల్లింపులు జరిగాయి. రైతులకు ఇంకా రూ. 5.96కోట్ల చెల్లింపులు జరగాల్సి ఉంది. ప్రస్తుతం జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోళ్లు తుది దశకు చేరాయి. నర్సంపేట రెవెన్యూ డివిజన్ పరిధిలోని కొన్ని కేంద్రాల్లో అరకొరగా ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నట్లు తెలిసింది. వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి కొన్న ధాన్యాన్ని అధికారులు రైస్‌మిల్లులకు తరలిస్తున్నారు. మరి కొద్దిరోజుల్లో యాసంగి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పూర్తి కానుందని అధికారులు తెలిపారు.

రెండు రకాలకు కామన్ రేటు

యాసంగి ధాన్యం కొనుగోళ్లు ఆరంభమైనప్పటి నుంచే కేంద్రాల్లో రైతులకు కొర్రీలు ఎదురయ్యాయి. మొదట్లో నిబంధనల ప్రకారం లేదని, తేమ అధికంగా ఉందని కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడానికి నిరాకరించారు. ఒత్తిడి వచ్చిన కేంద్రాల్లో బలవంతంగా కొనుగోలు చేసినా క్వింటాల్‌కు కొన్ని కిలోల లెక్కన కోత విధించారు. ఈ కోతపై రైతుల నుంచి నిరసన ఎదురవుతుండడంతో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కోతలకు గుడ్‌బై చెప్పి మునుపెన్నడూ లేని రీతిలో రెండు రకాల ధాన్యాన్ని కామన్ రకం కిందే కొనుగోలు చేశారు. దీంతో ఏ-గ్రేడ్ రకం ధాన్యం అమ్మిన రైతులకు కూడా కామన్ రకం ధాన్యం ధరే దక్కింది. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు ఏ-గ్రేడ్ రకం రూ. 2,203, కామన్ రకం రూ. 2,183. కామన్ రకం కలిసి ఉందని పేర్కొంటూ కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి ఏ-గ్రేడ్ రకం ధాన్యాన్ని కూడా కామన్ రకం కిందే కొనుగోలు చేశారు. ఇదే మిటని ప్రశ్నించిన రైతులకు ఏ-గ్రేడ్ రకం ధాన్యంలో కామన్ రకం ధాన్యం కలిసి ఉందని, అమ్మడం ఇష్టం లేకపోతే కొనుగోలు చేయలేమని నిర్వాహకుల నుంచి సమాధానం ఎదురైంది. ఈ నేపథ్యంలో రైతులు తిరిగి తీసుకెళ్లలేక కొనుగోలు కేంద్రాల్లో కామన్ రకం కింద విక్రయించారు.

ఎక్కడ జరిగిందంటే..?

జిల్లాలోని 13 మండలాల్లో యాసంగి ధాన్యం కొనుగోలు జరిగితే నర్సంపేట రెవెన్యూ డివిజన్ పరిధిలోని మండలాల్లో ఆలస్యంగా కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. కొనుగోలు కేంద్రాల్లో యాసంగి ధాన్యం కొనుగోలులో కొర్రీలను రైతులు నిలదీస్తున్న దృష్ట్యా ఆఖరున ప్రారంభమైన నర్సంపేట డివిజన్ మండలాల్లోని కొనుగోలు కేంద్రాల్లో రెండు రకాల ధాన్యాన్ని కామన్ రకం కింద కొనుగోలు చేశారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు ఏ-గ్రేడ్ రకం 42,948, కామన్ రకం 44,153 టన్నుల యాసంగి ధాన్యం కొనుగోలు జరిగినట్లు పౌరసరఫరాల శాఖ అధికారులు తెలిపారు. వాస్తవంగా నర్సంపేట డివిజన్ లోని మండలాల్లో కామన్ రకం కంటే ఏ-గ్రేడ్ రకం ధాన్యం దిగుబడి అధికంగా వచ్చింది. ఈ మండలాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఏ-గ్రేడ్ రకం ధాన్యాన్ని కూడా కామన్ రకం కిందే కొనుగోలు చేస్తుండడాన్ని పలువురు రైతులు పౌరసరఫరాల శాఖ అధికారులతోపాటు కలెక్టర్, అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో కొద్దిరోజుల క్రితం అదనపు కలెక్టర్ సంధ్యారాణి పలు కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులు, నిర్వాహకులతో మాట్లాడారు. ఏ-గ్రేడ్ రకం ధాన్యాన్ని కొన్నిచోట్ల కామన్ రకం కింద కొనుగోలు చేసినట్లు ఆమె దృష్టికి వచ్చింది. దీంతో సమస్య పరిష్కారం కోసం అదనపు కలెక్టర్ కేంద్రాల నిర్వాహకులు, రైతులకు కొన్ని సూచనలు చేశారు. అప్పటికే ఏ-గ్రేడ్ రకం ధాన్యం అమ్మిన రైతులు క్వింటాల్‌కు రూ. 20 చొప్పున ధర కోల్పోయారు. వెరసి కొన్ని వేల టన్నుల ఏ-గ్రేడ్ రకం ధాన్యానికి కామన్ రకం ధాన్యం ధర చెల్లింపు వల్ల రైతులకు రూ.లక్షల నష్టం వాటిల్లింది. పౌరసరఫరాల సంస్థ అధికారుల సహకారంతో రైస్‌మిల్లర్లు కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల ద్వారా ఈ వ్యవహారం సాగించినట్లు తెలిసింది. అదనపు కలెక్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ ఏ-గ్రేడ్ రకం ధాన్యాన్ని కామన్ రకం కింద కొనుగోలు చేస్తున్నారని తన దృష్టికి రావడంతో వెంటనే చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

పౌరులు బాధ్యతాయుతంగా ప్రవర్తించాలి

జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి భగవాన్‌రెడ్డి

సీపీఆర్ చేసే విధానాన్ని వివరిస్తున్న ఎన్‌డీఆర్ఎఫ్ బృందం

రాయపర్తి, జూన్ 22: ఆపత్కాలంలో పౌరులంతా బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి భగవాన్‌రెడ్డి కోరారు. మండలకేంద్రంలోని రైతు వేదికలో ఎన్డీఆర్ఎఫ్ బృందం మండల ప్రజలకు ప్రకృతి వైపరీత్యాలు-తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించింది. ఈ సందర్భంగా ఎన్‌డీఆర్ఎఫ్ టెన్త్ బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ భూపేంద్రకుమార్ నేతృత్వంలో బృందం సభ్యులు పలు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వర్షాకాలంలో బలమైన ఈదురుగాలులు వీయడం, ఉరుములు, మెరుపులతో పిడుగులు పడుతున్న సందర్భంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వర్షాలు కురిసే సమయంలో ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇనుప వస్తువులు, ఎత్తైన చెట్లు, ప్రదేశాల్లో ఉండొద్దన్నారు. ఆకస్మికంగా ఎవరైనా గుండెపోటుకు గురైతే తక్షణమే సీపీఆర్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఏవో ఉషాదయాళ్, ఎస్సై వడ్డె సందీప్‌కుమార్, వర్ధన్నపేట ఏడీఏ సురేశ్‌కుమార్, ఏవో గుమ్మడి వీరభద్రం, వర్ధన్నపేట అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాసరావు, ఏఈవోలు కడుదూరి రాజేశ్, ఉడుత సాయిప్రసాద్, రాజారపు శిరీష, వేమిరెడ్డి హిమబిందు, వల్లెరాజు మనస్విని పాల్గొన్నారు.

గుడ్డు ఇచ్చారు.. భోజనం మరిచారు

ఎంజీఎం దవాఖానలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం

అటెండెంట్లు నిలదీయడంతో భోజనం పంపిణీ చేస్తున్న డైట్ సిబ్బంది

కాశీబుగ్గ, జూన్ 22: వరంగల్ ఎంజీఎం దవాఖానలో రోగులకు భోజనం అందించకుండా డైట్ కాంట్రాక్ట్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కార్డియాలజీ విభాగంలో ఉన్న పేషెంట్లకు శనివారం రాత్రి డైట్ కాంట్రాక్ట్ సిబ్బంది గుడ్డు ఇచ్చారు భోజనం అందించడం మరిచిపోయారు. దీంతో అటెండెంట్లు భోజనం రాలేదని సిబ్బందిని అడుగగా, తాము వార్డులో పంపిణీ చేశామని, మీరే రాలేదని బుకాయించారు. దీంతో అధికారులకు ఫిర్యాదు చేస్తామని చెప్పడంతో మళ్లీ వార్డుకు వచ్చి భోజనం పంపిణీ చేశారు.

ఐదుగురు పోలీసులకు సేవా పతకాలు

సుబేదారి, జూన్ 22 : వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న ఐదుగురు పోలీసులకు రాష్ట్ర ప్రభుత్వం శనివారం సేవా పతకాలు ప్రకటించింది. వీరిలో హెడ్ కానిస్టేబుల్ టీ యాదగిరికి ఉత్తమ సేవా పతకం, సీఐ కే శ్రీధర్‌రావు, హెడ్ కానిస్టేబుళ్లు ఎండీ సాధిక్, ఎం భిక్షపతి, కానిస్టేబుల్ జీ శ్రీనివాస్‌కు సేవా పతకాలు లభించాయి.

'సత్వరమే పనులు పూర్తి చేయాలి'

వరంగల్, జూన్ 22 : గ్రేటర్‌లోని ట్రాన్స్‌ఫర్ స్టేషన్ల పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. శనివారం వరంగల్‌లోని పోతననగర్, బాలసముద్రంలోని ట్రాన్స్‌ఫర్ స్టేషన్ల పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ట్రాన్స్‌ఫర్ స్టేషన్ల సివిల్ పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. త్వరగా పూర్తి చేసి వాటిని అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

'నీట్'పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

కాశీబుగ్గ/ కరీమాబాద్, జూన్ 22: నీట్‌లో జరిగిన అవకతవకలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్ రాష్ట్ర కార్యదర్శి నవీద్ డిమాండ్ చేశారు. ఏఐఎస్‌వీ ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంటనే ఎన్‌టీఏను రద్దు చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రోహిత్, అఖిల్, సుమన్, రాజు, సాయి, హరీశ్ పాల్గొన్నారు. నీట్ పేపర్ లీకేజీకి కేంద్రం బాధ్యత వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రంగయ్య డిమాండ్ చేశారు. ఉర్సుగుట్ట సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

జాతీయస్థాయి ఇన్‌స్పైర్‌కు విద్యార్థి ఎంపిక

ఎగ్జిబిట్‌తో నిఖిల్‌వర్మ

గిర్మాజీపేట, జూన్ 22: జాతీయస్థాయి ఇన్‌స్పైర్‌మనాక్ 2023-24 ఎగ్జిబిషన్‌కు నెక్కొండ జడ్పీహెచ్‌ఎస్‌లో 10వ తరగతి చదువుతున్న భట్టు నిఖిల్‌వర్మ ఎంపికైనట్లు డీఈవో వాసంతి, జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ కట్ల శ్రీనివాస్ సంయుక్త ప్రకటనలో తెలిపారు. వర్చువల్ పద్ధతిలో ఈ నెల 14, 15న నిర్వహించిన రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ ఎగ్జిబిషన్ పోటీల్లో నిఖిల్‌వర్మ రూపొందించిన 'వాటర్ క్లీనర్ బోట్' జాతీయ స్థాయికి ఎంపికైంది. ఈ సందర్భంగా డీఈవో, డీఎస్‌వో నిఖిల్‌వర్మ, గైడ్ టీచర్ విశ్వప్రసాద్‌ను అభినందించారు.

విద్యార్థికి అభినందనలు

నెక్కొండ: నెక్కొండ హైస్కూల్‌కు చెందిన విద్యార్థి నిఖిల్‌వర్మ తయారు చేసిన రివర్ రెన్యూ రోవర్ (రివర్ క్లీనర్ బోట్) ప్రాజెక్ట్ జాతీయ స్థాయికి ఎంపిక కావడంపై హెచ్‌ఎం రంగారావు హర్షం వ్యక్తం చేశారు. నిఖిల్‌వర్మతోపాటు గైడ్ టీచర్‌ను అభినందించారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్

కాశీబుగ్గ, జూన్ 22: ఎంజీఎం దవాఖానలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్ కోరారు. శనివారం ఆయన ఆస్పత్రిని సందర్శించారు. రోగులు, అటెండెంట్లతో మాట్లాడారు. మౌలిక వసతులను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యాధికారులతో సమీక్షించారు. కొవిడ్ ముందు కన్నా ప్రస్తుతం ఎంజీఎంలో మెరుగైన వైద్య సేవలు అందుతున్నట్లు తెలిపారు. రోగులు ప్రైవేట్ దవాఖానలకు వెళ్లకుండా సర్కారు దవాఖానలకే వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రస్తుతం రోగుల సంఖ్య అధికంగా ఉందని, వైద్య సిబ్బంది కొరత ఉన్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని తాను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. సూపరింటెండెంట్ చంద్రశేఖర్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట సాగుతో భూసారం పెంపు

- డీఏవో ఉషాదయాళ్
- రాయపర్తిలో పంటల పరిశీలన

పత్తి పంటను పరిశీలిస్తున్న ఉషాదయాళ్

రాయపర్తి, జూన్ 22: వ్యవసాయ భూముల్లో పచ్చిరొట్టను సాగు చేస్తే భూసారం గణనీయంగా పెరిగి ఆశించిన స్థాయిలో దిగుబడి వస్తుందని జిల్లా వ్యవసాయాధికారి ఉషాదయాళ్ అన్నారు. రాయపర్తి, జేతురాంతండా, మొరిపిరాల, రాగన్నగూడెంలో అధికారులతో కలిసి శనివారం ఆమె పంట క్షేత్రాలను పరిశీలించారు. భూముల్లో జీలుగ, పిల్లి పెసర, జనుము సాగు చేసుకొని కలియదున్నితే భూసారం పెరుగుతుందన్నారు.

ఇద్దరు అదృశ్యం

ఖిలావరంగల్, జూన్ 22: మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇద్దరు అదృశ్యమైనట్లు సీఐ మల్లయ్య తెలిపారు. క్రిస్టియన్ కాలనీకి చెందిన ఆర్ నందిని(18) ఈ నెల 21న స్నేహితురాలిని కలిసి వస్తానని వెళ్లి తిరిగి రాలేదు. శివనగర్ రుద్రమాంబనగర్‌కు చెందిన బోళ్ల ప్రమీల(60) మానసిక స్థితి సరిగా లేక ఈ నెల 21న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. వారి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టినట్లు సీఐ పేర్కొన్నారు.

నిర్మాణాన్ని ఆపాలని నోటీసులు

చెన్నారావుపేట, జూన్ 22: కోనాపురం గ్రామంలో చేతిపంపు పక్కనే సెప్టిక్ ట్యాంక్ నిర్మాణాన్ని ఆపాలని స్థానికులు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు స్పందించిన మిషన్ భగీరథ డీఈఈ మంగీలాల్ శనివారం ఘటనా స్థలాన్ని పరిశీలించి సెప్టిక్ ట్యాంక్ నిర్మాణాన్ని మరోచోట చేపట్టాలని సూచించారు. కార్యదర్శి రాజు ఇంటి నిర్మాణం చేస్తున్న యజమానికి నోటీసులు అందజేశారు.

ఆరు గ్యారెంటీల సవరణల కేంద్రాల ఏర్పాటు

వరంగల్, జూన్ 22 : కాంగ్రెస్ ప్రభుత్వ ఆరు గ్యారెంటీల దరఖాస్తుల సవరణల కోసం కార్పొరేషన్ పరిధిలో కేంద్రాలను ఏర్పాటు చేశారు. జీరో కరెంట్ బిల్లు, గ్యాస్ సబ్సిడీ చాలా మందికి అందకపోవడంతో కొన్ని నెలలుగా కార్పొరేషన్ కార్యాలయం చుట్టూ జనం తిరుగుతున్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన నేపథ్యంలో శనివారం నుంచి కార్పొరేషన్ పరిధిలోని వార్డు కార్యాలయాల్లో సవరణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. బల్దియా ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేంద్రం వద్ద ప్రజలు బారులు తీరారు.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి

గ్రీవెన్స్‌లో దరఖాస్తులు స్వీకరించిన అదనపు కలెక్టర్

ఖిలావరంగల్, జూన్ 22: ప్రత్యేక గ్రీవెన్స్‌లో స్వీకరించిన దరఖాస్తుల్లోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ జీ సంధ్యారాణి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శనివారం దివ్యాంగులు, వృద్ధులకు ప్రత్యేక గ్రీవెన్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 15మంది ఫిర్యాదులు అందజేశారు. ఉపాధి కల్పన శాఖకు 5, డీఆర్డీవోకు 3, సంక్షేమ శాఖకు 3, పోలీసు శాఖకు ఒకటి, ఎస్సీ కార్పొరేషన్ జీడబ్ల్యూఎంసీకి ఒక దరఖాస్తు వచ్చినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారి మధురిమ పాల్గొన్నారు.

120 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం సీజ్

పర్వతగిరి, జూన్ 22: మండలంలోని ఏబీతండా శివారు ఉట్టితండాలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు 120క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై వెంకన్న తెలిపారు. పరకాలకు చెందిన పస్కం రమేశ్ చుట్టు పక్కల గ్రామాల్లో రేషన్ బియ్యం సేకరించి తండాలో డంపింగ్ చేశాడు. పోలీసుల తనిఖీల్లో 120 క్వింటాళ్ల బియ్యం బయటపడగా, స్వాధీనం చేసుకుని అతడిపై కేసు నమోదు చేశారు. బియ్యం విలువ రూ. 3.12 లక్షలు ఉంటుందని, సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై వెంకన్న వెల్లడించారు.

రెండు రోజులు తాగునీటి సరఫరా బంద్

వరంగల్, జూన్ 22 : దేశాయిపేట ప్రతాపరుద్ర ఫిల్టర్‌బెడ్ పరిధిలో పైప్‌లైన్ మరమ్మతులు జరుగుతున్న నేపథ్యంలో వరంగల్ ప్రాంతంలో రెండు రోజుల పాటు తాగునీటి సరఫరా నిలపివేస్తున్నట్లు బల్దియా ఈఈ శ్రీనివాసరావు తెలిపారు. దేశాయిపేట, కొత్తవాడ, ఆటోనగర్, ఎల్‌బీ నగర్, పోచమ్మమైదాన్, కాశీబుగ్గ, కంటి దవాఖాన, ఎంజీఎం ఆస్పత్రి ఏరియా, కేఎంసీ, మట్టెవాడ, వరంగల్ చౌరస్తా, బట్టల బజార్, సంతోషిమాత కాలనీ, హంటర్‌రోడ్, చార్‌బౌళీ, గోవిందరాజుల స్వామి గుట్ట, క్రిస్టియన్ కాలనీ, లేబర్‌కాలనీ, ఎస్ఆర్‌టీ కాలనీ, ఎనుమాముల, ఆరెపల్లి, కొత్తపేట, గొర్రెకుంట, కీర్తినగర్, పైడిపల్లి, మొగిలిచర్ల, ధర్మారం ప్రాంతాల్లో రెండు రోజులు తాగునీటి సరఫరా ఉండదని, ప్రజలు సహకరించాలని కోరారు.

మిషన్ భగీరథ సర్వేను వేగవంతం చేయాలి

రికార్డులను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో రాంరెడ్డి

ఖానాపురం, జూన్ 22: మిషన్ భగీరథ సర్వేను వేగవంతం చేయాలని జడ్పీ సీఈవో రాంరెడ్డి ఆదేశించారు. శనివారం ఆయన మండల పరిషత్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి మండలంలోని మిషన్ భగీరథ సర్వే తీరుతెన్నులను ఎంపీడీవో భారతిని అడిగి తెలుసుకున్నారు. సర్వే పనులను పారదర్శకంగా, త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యాలయంలో సిబ్బంది కొరత ఉన్నట్లు గుర్తించారు. త్వరలోనే సిబ్బంది నియామకం చేపట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ఎంపీవో రవి, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

'పైపులైన్‌తో ఇబ్బందులు'

నాలాలో పైపులైన్ వద్ద ఆగిన చెత్తను చూపుతున్న కార్పొరేటర్ రాజు

కరీమాబాద్, జూన్ 22: అండర్ రైల్వేగేట్ ప్రాంతంలోని సాకరాశికుంట నాలాలో అడ్డుగా ఏర్పాటు చేసిన తాగునీటి పైపులైన్ వల్ల ఏటా పలు కాలనీలు ముంపునకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని సాకరాశికుంట కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం కార్పొరేటర్ సిద్ధం రాజు, శానిటరీ సూపర్‌వైజర్ సాంబయ్యతో కలిసి స్థానికులు నాలాను పరిశీలించారు. ఖిలావరంగల్‌తోపాటు రంగశాయిపేట తదితర ప్రాంతాల నుంచి నాగేంద్రనగర్ మీదుగా జన్మభూమి జంక్షన్ ద్వారా సాకరాశికుంట నాలాలో మురుగునీరు ప్రవహిస్తుందన్నారు. నాలా మధ్యలో పైపులైన్ ఉండడంతో చెత్తాచెదారం తట్టుకొని నీరు సాఫీగా వెళ్లక ఏటా వర్షాకాలంలో సాకరాశికుంట, లక్ష్మీనగర్, ఏకశిలానగర్ ముంపునకు గురవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి

కాశీబుగ్గ, జూన్ 22: వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ పరిధిలో పేరుకుపోయిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖను మర్యాదపూర్వకంగా కలిసి మార్కెట్ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఆమె సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. చాంబర్ మాజీ అధ్యక్షుడు కటకం పెంటయ్య, సాగర్ల శ్రీనివాస్, ఎన్‌రెడ్డి లింగారెడ్డి, చింతలపల్లి వీరారావు, కే శ్రీధర్ పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తుల పట్టివేత

గిర్మాజీపేట, జూన్ 22: నిషేధిత పొగాకు ఉత్పత్తులను నిల్వ చేసిన దుకాణంపై శనివారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. ఈ సందర్భంగా రూ. 40,538 విలువైన పొగాకు ఉత్పత్తులను సీజ్ చేసినట్లు టాస్క్ ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. పిన్నవారివీధి డాల్ఫిన్ గల్లీలో గిర్మాజీపేటకు చెందిన కోటదియా ఆరిఫ్‌కు చెందిన గోల్డెన్ కన్వెక్షనరీ షాపులో వివిధ రకాల రూ.40,538 విలువైన పొగాకు ఉత్పత్తులను గుర్తించి, నిందితుడిని అదుపులోకి తీసుకొని మట్టెవాడ పోలీసులకు అప్పగించామని తెలిపారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు సార్ల రాజు, సుంకరి రవికుమార్ పాల్గొన్నారు.

అడవుల విధ్వంసంతో నష్టం

నర్సంపేట, జూన్ 22 : అడవుల విధ్వంసం వల్ల నష్టం జరుగుతున్నదని స్వయంకృషి స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి బెజ్జంకి ప్రభాకర్ అన్నారు. నర్సంపేటలోని బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం ప్రపంచ వర్షారణ్య పరిరక్షణ దినోత్సవం సందర్భంగా సదస్సు నిర్వహించారు. భూ ఉపరితలంలో మూడింటా ఒకవంతు అడవులే ఉన్నాయన్నారు. చెట్ల నుంచే ఆక్సిజన్ వస్తుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కాంతారావు, పీఈటీ స్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొంకపాకలో విద్యార్థికి సన్మానం

విద్యార్థిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పర్వతగిరి, జూన్ 22: ఇటీవల నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికైన కొంకపాక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న గద్దల సంతోష్‌ను శనివారం ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కర్నిళ్ల మోహన్‌రావు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ స్వప్న, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'ప్రైవేట్ పాఠశాలల తీరుపై చర్యలు తీసుకోవాలి'

నర్సంపేట : వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నర్సంపేట, జూన్ 22: ప్రైవేట్ పాఠశాలల్లో జరుగుతున్న వ్యాపారంపై అధికారులు నిఘా పెట్టి చర్యలు తీసుకోవాలని అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య జిల్లా కార్యదర్శి జన్ను రమేశ్ డిమాండ్ చేశారు. నర్సంపేటలోని ఆర్డీవో కార్యాలయంలో శనివారం వినతిపత్రం అందజేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో పర్మిట్ దాటిన వాహనాలను నడుపుతున్నారని, పాఠ్యపుస్తకాలు, యూని ఫాం అమ్ముతున్నారని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు 25శాతం ఉచిత విద్యను అందించాలని కోరారు. కార్యక్రమంలో రాజమౌళి, నాగరాజు, రాకేశ్, అజిత్, అజయ్ పాల్గొన్నారు.

అధిక ఫీజులను నియంత్రించాలి..

నెక్కొండ: నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజు వసూలు చేస్తున్న మండలంలోని ప్రైవేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి బానోత్ వినోద్‌కుమార్ డి మాండ్ చేశారు. నెక్కొండలో శనివారం నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యాహక్కు చట్టం-2009ను పకడ్బందీగా అమలు చేసి పేద, మధ్య తరగతి విద్యార్థులకు మెరుగైన విద్య అందేలా చూడాలన్నారు. ప్రైవేట్ విద్యా సంస్థల్లో పేదలకు 25శాతం సీట్లు కేటాయించాలన్నారు. అధిక ఫీజు వసూళ్లపై అధికారులు చర్యలు చేపట్టకపోతే దశల వారీగా ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

KVB కరూర్ వైశ్యా బ్యాంక్ | వరంగల్ శాఖ, వరంగల్ జిల్లా.

నగల వేలం ప్రకటన

ఈ దిగువ తెలిపిన నగలను బ్యాంకు వారు బహిరంగ వేలం ద్వారా వేలం వేయ నిర్ణయించినారు. కావున తెలియజేయడమైనది.

వేలం జరుగు స్థలము	: బి కరూర్ వైశ్యా బ్యాంకు లిమిటెడ్, వరంగల్ శాఖ, నిర్మలమాల్, జె.పి.యన్. రోడ్, వరంగల్. ఫోన్: 0870-2562149,
నగల తనిఖీ మరియు సమయము	: తేది. 05-07-2024 మ॥ 3 గం.ల నుండి 3.30 గం.ల వరకు (బ్యాంకు పనిదినములలో)
వ